క్లుప్తంగా

నాణ్యమైన భోజనం అందించాలి

ఉపసర్పంచ్ అనిల్

తలకొండపల్లి: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్, ఉపసర్పంచ్ అనిల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక విద్యార్థుల వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి అల్పాహార భోజనం చేశారు. హాస్టల్‌లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటర్ ఫిల్టర్ చెడిపోయిందని, తాగునీటికి ఇబ్బందులు పడుతన్నామని, లైట్లు, ఫ్యాన్‌లు పాడైనట్లు విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆయా విషయాలను హాస్టల్ వార్డెన్ దృష్టికి తీసుకుపోయి పరిష్కారం అయ్యేలా చూస్తమాని అనిల్ చెప్పారు.

గిరిజన సంక్షేమానికి కృషి

సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: గిరిజనుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తుందని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. పాఠశాలలో 3వతరగతి నుండి 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్నాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమ అధికారి రాములు, విద్యా వలంటీర్లు సాయిలు, మంజుల తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

కడ్తాల్: మండల పరిధిలోని మక్తమాదారం గ్రామానికి చెందిన వెంకటయ్య గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని శుక్రవారం ఉదయం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, సర్పంచ్ సులోచన సాయిలు పరామర్శించారు. బాధిత కుటుంబానికి నర్సింహ రూ.5వేలు, సర్పంచ్ సులోచన సాయిలు రూ.3 వేలు, వార్డు సభ్యుడు నారాయణ రూ. 2వేలు సాయం అందించారు. పరామర్శించిన వారిలో ఉపసర్పంచ్ గణేశ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్సింహగౌడ్, కిసాన్ సెల్ మండల నాయకులు బాల్‌రాజ్, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు ఉన్నారు.

కనకమ్మ కుటుంబానికి..

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని నవచైతన్య కాలనీకి చెందిన కనకమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందింది. కనకమ్మ కుటుంబానికి శుక్రవారం అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఒగ్గు మహేశ్ రూ.11 వేలు ఆర్థికసాయం అందించారు. సంఘం ప్రచార కార్యదర్శి హఫీజ్, సభ్యులు, సూర్య, కుమార్, వినయ్, శివ, చరణ్, ప్రశాంత్, శ్రీశైలం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు శుక్రవారానికి 12వ రోజుకు చేరుకున్నాయి. వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డేవిడ్ వారికి మద్దతు తెలిపారు. ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు దీక్షలు కొనసాగుతయన్నారు. కార్యాక్రమంలో బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, సర్పంచ్ జయమ్మ, వెంకటయ్య, గౌడసంఘం తాలూకా కన్వీనర్ అశోక్‌గౌడ్, నాయకులు.. పవన్‌వాల్మీకి, కృష్ణయ్య, రేణురెడ్డి, శ్రీను, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంఘం మండల కమిటీ ఎన్నిక



కమిటీ సభ్యులను సన్మానించిన నాయకులు

మంచాల: మంచాల మండల యాదవ సంఘం అధ్యక్షుడిగా తిప్పాయిగూడ గ్రామానికి చెందిన ఐలయ్య ఎన్నికయ్యారు. శుక్రవారం మంచాలలో యాదవ సంఘం మండల సమావేశం నిర్వహించి సంఘం సభ్యులను ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఐలయ్య, ప్రధాన కార్యదర్శిగా యాదయ్య(బండలేమూర్)మండల యూత్ కమిటీ అధ్యక్షుడిగా రాజేష్ (నోముల), ప్రధాన కార్యదర్శిగా మధును ఎన్నుకున్నారు. అనంతరం సంఘం అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఆసంఘం జిల్లా అధ్యక్షుడు జగదీశ్‌యాదవ్, నాయకులు మల్లేశ్, బద్దుల బాలరాజ్, జెనిగె పాండు, మహేందర్, ఐలేష్, శ్రీశైలం నర్సింహ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శిగా అనిల్

ఇబ్రహీంపట్నం రూరల్: కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం మండల ప్రధాన కార్యదర్శిగా పోల్కంపల్లి గ్రామానికి చెందిన అనిల్‌ను నియమించారు. ఈ మేరకు ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ, టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్‌రెడ్డి రంగారెడ్డి శుక్రవారం నియామకపత్రం అందజేసినట్లు అనిల్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని తెలిపారు.

‘రాయితీ’కి మంగళం!

- రైతులకు అందని సబ్సిడీ యంత్రాలు
- మార్కెట్‌లో అధిక ధరలకు కొనలేని పరిస్థితి
- ఆశించిన స్థాయిలో రాని దిగుబడి
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

కడ్తాల్: సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అందజేసే సబ్సిడీ యంత్రాలు అందక రైతన్నలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సాగులో సాంకేతికత, యాంత్రీకరణ పరిజ్ఞానం ఆశించిన స్థాయిలో చేరకపోవడంతో రైతులు ఆశించిన దిగుబడులు సాధించడం లేదు. మారుతున్న కాలానికి అనుగుణంగా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించేందుకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువవడంతో ఆశించిన ఫలితాలు రావడం లేదు. స్వరాష్ట్రంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకాలను ప్రభుత్వం పక్కన పెట్టడంతో రైతన్న పరిస్థితి అధ్వాన్నంగా తయారయ్యింది. గత 6–7 సంవత్సరాల నుంచి సబ్సిడీ పరికరాలు అందకపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారయ్యింది.

మండలంలో...

కడ్తాల్ మండలంలో 24 గ్రామ పంచాయితీల్లో 12,200 మంది రైతులు ఉండగా సుమారు 33వేల ఎకరాలకుపైగా సాగుభూమి ఉంది. వ్యవసాయశాఖ ద్వారా గతంలో రైతులకు సబ్సిడీ పథకాలు అందేవి. డ్రిప్ పరికరాలు, కేజీ వీల్స్, కల్టివేటర్, రోటో వేటర్, తైవాన్ స్ప్రేలు, నాగళ్లు, మినీ ట్రాక్టర్లు, టార్పాలిన్ కవర్లు తదితర వ్యవసాయ పనిముట్లను ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై అందజేసేది. అయితే గత 6–7 సంవత్సరాల నుంచి సబ్సిడీ పరికరాల గురించి ప్రభుత్వం ఊసే ఎత్తడం లేదు. దీంతో రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారు.

నిలిచిపోతున్న పథకాలు..

వ్యవసాయశాఖ ద్వారా రాయితీ పథకాలు ఒక్కొక్కటిగా నిలిచిపోతున్నాయి. 2006–07 సంవత్సరం నుంచే వ్యవసాయ పథకాలకు కోత పడుతూ వస్తోంది. రైతుకు ఎక్కువగా ఉపయోగపడే నాగళ్లు, ఇతర పనిముట్లు 2014 నుంచే నిలిచిపోయాయి. 2016–17 ఆర్థిక సంవత్సరం వరకు అందుబాటులో ఉన్న 10 నుంచి 12 రకాల పనిముట్లు, ఆ తర్వాత కనుమరుగయ్యాయి. దీంతో అన్నదాతకు అత్యవసరమైన పరికరాలు రాయితీపై అందకుండా పోయాయి. యాంత్రీకరణ, రాయితీ పథకాలు ఒక్కొక్కటిగా నిలిచిపోతుండటం, మరోవైపు మంజూరయ్యే యూనిట్లు కూడా నామమాత్రంగా ఉంటున్నాయి. రైతులకు నిత్యావసరంగా మారిన టార్పాలిన్ కవర్లు కూడా చాలవరకు తగ్గించారు. కల్టివేటర్, రోటోవేటర్, జాడేలేదు. వ్యవయసాయ యాంత్రీకరణ పథకాలను యథావిధిగా కొనసాగించాలని రైతులు కోరుతున్నారు.



మండల వ్యవసాయశాఖ కార్యాలయం

“మార్కెట్లో అధిక ధరలు ఉన్నాయి



ప్రభుత్వం సబ్సిడీపై అందజేసే పనిముట్లు నిలిచిపోడంతో ఇబ్బందులు పడుతున్నాం. బయటి మార్కెట్‌లో అధిక ధరలు పెట్టి కొనుగోలు చేయలేకపోతున్నాం. రైతులకు ఆసరాగా ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించిరైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లను, యంత్రాలను అందజేయాలి.

– శక్రునాయక్, రైతు, పెద్దారెడ్డిచెరువు తండా

రాయితీపై యంత్రాలు అందించాలి



ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన మాదిరిగానే సబ్సిడీపై వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు అందజేయాలి. యాంత్రీకరణ పనిముట్లు అందజేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బయటి మార్కెట్‌లో వ్యవసాయ పనిముట్లకు ధరలు అధికంగా ఉండటంతో కొనలేని పరిస్థితి. వెంటనే సబ్సిడీపై పనిముట్లు అందించాలి.

– శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు, కడ్తాల్

150 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయండి

ఆమనగల్లులో బీజేపీ నేతల నిరాహార దీక్ష



నిరాహార దీక్షలో బీజేపీ నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి స్థాయి పెంచి రోగులకు మెరుగైన సేవలు అందించాలని మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్ డిమాండ్ చేశారు. ఆమనగల్లు ప్రభుత్వాస్పత్రి స్థాయి పెంచి 150 పడకల ఆస్పత్రిగా మార్చాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో ఆమనగల్లు బస్టాండ్ సమీపంలో శుక్రవారం ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టారు. బీజేపీ నేతల దీక్షకు ఆ పార్టీ సీనియర్ నేత ఆచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కండె హరిప్రసాద్, ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య తదితరులు సంఘీభావం తెలిపారు. ఆచారి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ గత ఎన్నికల ముందు ఆమనగల్లు పట్టణానికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. దీక్ష కార్యక్రమంలో బీజేపీ నాయకులు.. ఆనంద్, శ్రీశైలం, విజయ్‌కృష్ణ, ఆనంద్, పారేశ, కిరణ్, మల్లేశ్‌లు, కమలేష్, నర్సింహ, శేఖర్, లక్ష్మణ్, చెన్నకేశవులు, రవిరాథోడ్, మహేశ్, శ్రీను, శ్రీధర్, సర్పంచ్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నామని..



సాలయ్య కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న మిత్రులు

ఆమనగల్లు: ఆపదలో ఉన్న బాల్యమిత్రుల కుటుంబాలకు ఆర్థికసాయం అందించి తోటి మిత్రులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990–91 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన విద్యార్థి, ముర్తుజపల్లి గ్రామస్తుడు సాలయ్యకు గుండెపోటు రావడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలియడంతో తోటి ఎస్‌ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు అంతా కలిసి రూ.75 వేలు పోగుచేసి శుక్రవారం సాలయ్య కుటుంబ సభ్యులకు అందించారు. అలాగే ఎస్‌ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన మిత్రుడు జంగయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబానికి రూ.22 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో శ్రీధర్, సూర్యప్రకాశ్, దుర్గయ్య, ప్రదీప్, రమేశ్, శ్రీధర్, వెంకటేశ్, యాదయ్య, సంజీవ్‌కుమార్, శ్రవన్‌కుమార్, దామోదర్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

ఎంపీపీ కమ్లీమోత్యానాయక్



పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ కమ్లీమోత్యానాయక్

కడ్తాల్: గ్రామాల్లో కమ్యూనిటీ సోక్‌పిట్‌ల నిర్మాణంపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అన్నారు. మండల పరిధిలోని మైసిగండి గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం కమ్యూనిటీ సోక్‌పిట్ నిర్మాణ పనులను అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆమె ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. నీటి వృథాను అరికట్టేందుకు, భూగర్భ జలాలు పెరిగేందుకు సోక్‌పిట్‌ల నిర్మాణం చేపట్టాలని, ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని సూచించారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద కమ్యూనిటీ సోక్‌పిట్‌ల నిర్మాణానికి, ప్రభుత్వం రూ.12వేలు అందిస్తుందని, వ్యక్తిగత సోక్‌పిట్‌ల నిర్మాణానికి రూ.6వేలు అందించడం జరుగుతుందన్నారు. మండలంలో 45 చోట్ల కమ్యూనిటీ సోక్‌పిట్ల(ఇంకుడుగుంత)ను నిర్మించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కమ్యూనిటీ, వ్యక్తిగత సోక్‌పిట్లను నిర్మించుకోవాలని కోరారు. అనంతరం హరితాహారంలో భాగంగా పాఠశాల పరిసరాల్లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, సర్పంచ్ తులసీరాంనాయక్, కార్యదర్శి సత్యం, టెక్నికల్ అసిస్టెంట్ ప్రేమలత, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీను, వార్డెన్ బాలరాజు పాల్గొన్నారు.

టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- ప్రభుత్వ పాఠశాలలకు డిజిటల్ పరికరాల అందజేత



ఇబ్రహీంపట్నం: ఉపాధ్యాయిలకు డిజిటల్ పరికరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: పాఠశాల స్థాయి నుంచే టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మండల పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు డిజిటల్ పరికరాలు, క్రీడా సామగ్రిని ఎంపీపీ కృపేశ్, జెడ్పీటీసీ భూపతిగాళ్ల మహిపాల్, వైస్ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డితో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాఠశాల స్థాయి విద్య.. విద్యార్థుల భవిష్యత్తుకు పునాదిలాంటిదన్నారు. రోజురోజుకు పెరుగుతున్న శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఆధునిక టెక్నాలజీతో విద్యాబోధన చేయాలని కోరారు. డిజిటల్ పరికరాలకు మండల పరిషత్ నిధులు కేటాయించి పంపిణీ చేయడం హర్షించదగ్గ పరిణామమన్నారు. ఆడియో, వీడియోల ద్వార విద్యాబోధన చేస్తే విద్యార్థులు విషయ పరిజ్ఞానాన్ని సులువుగా పొందగలుగుతారన్నారు. మన ఊరు–మన బడి కింద మండలంలో 22 పాఠశాలలకు నిధులు కేటాయించి అభివృద్ధి పరుస్తున్నట్లు తెలిపారు. ఎంకేఆర్ ఫౌండేషన్ ద్వారా నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు శిక్షణను ఇవ్వడం వలన ఇప్పటి వరకు సుమారు 1010 మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. త్వరలో టెట్, డీఎస్సీని ప్రభుత్వం నిర్వహిస్తుందని.. ఈ పరీక్షలకు హాజరయ్యే వారికి తమ ఫౌండేషన్ ద్వారా ఉచిత శిక్షణను ఇవ్వనున్నట్లు చెప్పారు. మండలంలోని పాఠశాలల మౌలిక అవసరాల కోసం రూ.10 లక్షల నిధులు కేటాయిస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. ఈ సందర్భంగా 2022–23 విద్యాసంవత్సరంలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపిక అందించడంతో పాటు ప్రోత్సాహక బహుమతులను ఎమ్మెల్యే అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, ఎంపీపీ కృపేశ్, జెడ్పీటీసీ మహిపాల్, వైస్ ఎంపీపీ మంచిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీఓ జయరాంవిజయ్, మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు పరమేశ్, పీఏసీఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

మంచాల: సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. మంచాల మండలంలోని బోడకొండ గ్రామానికి చెందిన జాటోత్ విజయకు మంజూరైన రూ.60వేల సీఎం రీలిఫ్ ఫండ్ చెక్కును శుక్రవారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో మంచాల ఎంపీపీ నర్మద, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, మాజీ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ రవి, ఎంపీటీసీ సభ్యురాలు సుకన్య, సర్పంచ్ ఆలివేలు, ఉపసర్పంచ్ భద్రీనాథ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు

విద్యారంగ సమస్యలపై పోరాటం

తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్



సభ్యత్వ నమోదులో పాల్గొన్న తపస్ సంఘం నాయకులు

మంచాల: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, ఉపాధ్యక్షుడు నర్సింహ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని నోముల ప్రభుత్వ పాఠశాలలో తపస్ ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ప్రతి పాఠశాలలో పారిశుద్ధ్య కార్మికులను నియమించాలన్నారు. ఉపాధ్యాయులకు రావాల్సిన పీఆర్‌సీ, డీఏ బకాయిలు ఒకేసారి విడుదల చేయాలన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించకుంటే రానున్న రోజుల్లో తపస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహ, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శి లలిత, సురేష్, కావలి రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, శ్రీనివాస్, రాజవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గౌడసంఘం భవన ప్రహరీకి శంకుస్థాపన

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని కవాడిపల్లి గ్రామంలో గౌడ సంఘం గ్రామశాఖ అధ్యక్షుడు బొడిగె వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న గౌడ సంఘం భవవ ప్రహరీ నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. రూ.5లక్షల జిల్లా పరిషత్ నిధులతో చేపడుతున్న ఈ పనులను జెడ్పీటీసీ దాసుగౌడ్, వైస్ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్ సుజాత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మోహన్‌రెడ్డి, వార్డుసభ్యులు కొండల్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు సురేష్‌గౌడ్, రంగా క్రిష్ణాగౌడ్, చెన్నయ్యగౌడ్, వెంకటేశ్, శ్రీనివాస్, రమేష్, క్రిష్ణ, ధనుంజయ్య, హరినాథ్‌లు పాల్గొన్నారు.

పార్కుస్థలాన్ని కాపాడండి: సీపీఐ

తుర్కయంజాల్: కబ్జాకు గురవుతున్న తుర్కయంజాల్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 549, 550, 551లోని శ్రీ మిత్ర వెంచర్‌లోని 3 ఎకరాల పార్కు స్థలాన్ని కాపాడాలని సీపీఐ రాష్ట సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య కోరారు. స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం ఆయన పార్కును పరిశీలించారు. అధికారుల అలసత్వం కారణంగానే పార్కులు, మన్నెగూడలోని ఎర్రకుంట చెరువు అన్యాక్రాంతం అవుతుందని ఆరోపించారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి పార్కు స్థలాన్ని, చెరువును కాపాడాలని కోరారు. ఆక్రమణలపై అధికారులు ఉక్కుపాదంమోపాలన్నారు.నాయకులు శివకుమార్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టండి

జెడ్పీటీసీకి పోలెపల్లి గ్రామస్తుల వినతి

ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధిలోని జంగారెడ్డిపల్లి నుంచి పోలెపల్లి గేటు వరకు రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని మాలెపల్లి గ్రామస్తులు కోరారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం జెడ్పీటీసీ అనురాధకు వారు వినతిపత్రం అందించారు. రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరైనందున పనులను వెంటనే ప్రారంభించేలా చూడాలని కోరారు. అలాగే గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌తో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని జెడ్పీటీసీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రవికుమార్, లక్ష్మయ్య, మల్లేశ్, శ్రీను, విజేందర్, ప్రశాంత్, నరేశ్, రవీందర్, శేఖర్, కృష్ణ, యాదగిరి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి

తొమ్మిదో రోజుకు చేరుకున్న జీపీ కార్మికుల సమ్మె

తలకొండపల్లి: పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఎదుట జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె శిబిరాన్ని వెంకటయ్య శుక్రవారం సందర్శించి సంఘీభావం ప్రకటించారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కురుమయ్య, గొర్లకాపరుల సంఘం జిల్లా నాయకులు పెంటయ్య, వెంకట్‌రెడ్డి, కార్మికుల అధ్యక్షురాలు యాదమ్మ, కోకన్వీనర్ రవలి, సభ్యులు యాదమ్మ, భిక్షపతి, అలివేలు, జంగమ్మ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి..

కడ్తాల్: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని.. సీఐటీయూ నాయకులు ఆశీర్వాదం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారానికి తొమ్మిదో రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో దశరథం, రవి, రామకృష్ణ, కుమార్, మహేశ్, లక్ష్మమ్మ, లక్ష్మయ్య, సరస్వతి, చంద్రకళ, యాదయ్య, పద్మమ్మ, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఇసీ శేఖర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నంలో సమ్మె చేస్తున్న జీపీ కార్మికుల శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించి సంఘీబావాన్ని తెలిపారు. పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

అర్హులందరికీ దళిత బంధు ఇవ్వాలి



యాచారం: నిరసన తెలుపుతున్న బీజేపీ నేతలు

బీజేపీ నేతల నిరసన

యాచారం: గ్రామాల్లో ప్రాధాన్యత కింద అర్హులను గుర్తించి దళితబంధు పథకాన్ని వర్తింపజేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు రవీందర్ పేర్కొన్నారు. శుక్రవారం యాచారం మండల కేంద్రంలో దళిత మోర్చా ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరాస్తా వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. దళితబంధు పథకాన్ని బీఆర్ఎస్ కార్యకర్తలకు మాత్రమే కాకుండా గ్రామసభల ద్వారా అర్హులను గుర్తించి వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అలాగే మండల పరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ సిబ్బంది చేస్తున్న సమ్మెకు శుక్రవారం బీజేపీ యాచారం మండల శాఖ మద్దతు ప్రకటించింది. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు యాదయ్య, జంగయ్య, శాంతికుమార్, దయానంద్, నరేందర్‌గౌడ్, రమేష్, కృష్ణ, పత్తిరాజు, పాండు,హరికిషన్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

తుర్కయంజాల్ చౌరస్తాలో..

తుర్కయంజాల్: రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద దళిత కుటుంబానికి దళితబంధు పథకాన్ని అందించాలని బీజేపీ వనపర్తి జిల్లా ప్రభారీ ప్రతాప్ అన్నారు. దళితబంధులో పక్షపాతాన్ని నిరసిస్తూ శుక్రవారం తుర్కయంజాల్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ శ్రీలత, నాయకులు పురుషోత్తం, నర్సింహ, నర్సింహారెడ్డి, రమేష్, దాసు పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధితో ఎదగాలి



రెడీమిక్స్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఆచారి

బీజేపీ సీనియర్ నేత ఆచారి

ఆమనగల్లు: యువత స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని బీజేపీ సీనియర్ నేత ఆచారి కోరారు. ఆమగనల్లు మున్సిపాలిటీ పరిధిలోని ముర్తుజపల్లి గ్రామ సమీపంలో మున్సిపల్ కౌన్సిలర్ కర్నాటి విక్రంరెడ్డి ఏర్పాటు చేసిన కేవీఆర్ రెడిమిక్స్ ప్లాంట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ రాధమ్మ వెంకటయ్య, కౌన్సిలర్‌లు చెన్నకేశవులు, లక్ష్మణ్, మేడిశెట్టి శ్రీదర్, మాజి జెడ్‌పీటీసీ కండె హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు సాధిద్దాం

ఎంపీడీఓ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్

మంచాల: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ అవార్డు–2023కు ఆరుట్ల గ్రామం ఎంపిక కోసం కృషి చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆరుట్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో పారిశుద్ధ్య సమస్య లేకుండా చూడాలన్నారు. తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రమేష్, ఉపసర్పంచ్ జంగయ్యగౌడ్, ఎంపీఓ తేజ్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, ఏపీఓ వీరాంజనేయులు, ఈసీ విమల, టీఏ శేఖర్, వార్డుసభ్యులు వెంకటేష్, స్వప్న, మల్లేష్, శివ, యాదయ్య, ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, వీబీకేలు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు



యాచారం: ఆషాఢమాస చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని నందివనపర్తిలోని శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారికి పూజారి రాఘవేంద్రశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సామూహిక లలితా సహస్రనామ పారాయణం, కుంకుమార్చన, చిన్నారులకు అక్షరాభ్యాసం వంటివి నిర్వహించారు. సరస్వతీ అమ్మవారు శాకాంబరీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. మాతృమండలి సభ్యులు రుద్రమ్మ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న వెంకటేశ్వర్లు, లక్ష్మీకళ

యాచారం: పాఠశాల స్థాయిలోనే గొప్ప లక్ష్యాన్ని ఎంచుకొని ఆదిశగా ముందుకు సాగాలని మాజీ ఎంపీపీలు రాచర్ల వెంకటేశ్వర్లు, లక్ష్మీకళ పేర్కొన్నారు. రాచర్ల వెంకటేశ్వర్లు గారి తల్లి రాచర్ల ఈశ్వరమ్మ జ్ఞాపకార్థం శుక్రవారం నందివనపర్తి ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.2లక్షల విలువ జేసే నోటుపుస్తకాలు, ఇతర సామగ్రిని అందజేశారు. వారు మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతుందని అన్నారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలకే పిల్లలను పంపిచాలని సూచించారు. భవిష్యత్‌లో కూడా ప్రభుత్వ పాఠశాలకు ఆర్థిక సహకారం అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాచర్ల పార్వతమ్మ, పాఠశాల హెచ్‌ఎం కిషన్ నాయక్, గ్రామస్తులు.. రామకృష్ణ, శ్రీశైలం, అనంతం, మల్లయ్య, యాదగిరి పాల్గొన్నారు.